# ఆత్మ విశ్వాసమే సర్వబలములను అందిస్తుంది

సకలవిద్యలు నేర్చి సభ జయింపగ వచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజైపుట్టి రాజ్యమేలగవచ్చు
హేమ భూదానముల్ యీయవచ్చు
గగనంపు చుక్కలు గణియింపగా వచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగ విద్యల నన్ని నేర్వగవచ్చు
చంద్రమండల యాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియాదుల నరికట్టి
మనసు నిల్పియు నంతర్ముఖముజేసి
అనవరత నిశ్చలమైన ఆత్మలగుచు
నిలువగా లేరు మానవుల్ నియతితోడ

ప్రేమస్వరూపులారా!

వేదవిజ్ఞానము అనంతము. జ్ఞానమే అనంతము. సత్యమును చూపునదే జ్ఞానము. భూతభవిష్యద్వర్తమానములకు అతీతమైనది, సత్యము. సత్యజ్ఞానములు రెండుకూడను అనంతములే! అనంతములగుటచేత దీనికి ఆది లేదనికూడా చెప్పవచ్చును. సత్యజ్ఞానములతో కూడి ఉండటంచేత వేదముకూడను అనంతమే!

**వాక్కే ఋగ్వేదము, మనస్సే యజుర్వేదము, ప్రాణమే సామవేదము**

వేదము జ్ఞానమయమైనప్పటికిని నేడు మనము వాఙ్మయముగా సేవిస్తున్నాము. మన వాక్కే ఋగ్వేదమనియు, మనస్సు యజుర్వేదమనియు, ప్రాణము సామవేదమనియు బృహదారణ్యకోపనిషత్తు చక్కగా బోధించుచున్నది. 'వేదము, వేదాంగములు, వేదవేత్త మూడును నేనే'నని గీతాచార్యునియొక్క నుడువు. కాని, నిత్యసత్యములు గుర్తించుకొనలేక,

sri sathyasai vachanamrutam

పవిత్రమైన జ్ఞానతత్త్వాన్ని అర్థము చేసుకొనలేక, లౌకికమైన జీవితమునందు అలౌకికమైన వాంఛలచేత మానవత్వాన్ని మనము విస్మరిస్తున్నాము. అయితే, పవిత్రమైన ఈ వాఙ్మయమును వేదము విడివిడి పదములచేత విపులీకరించి శబ్దబిందువులను అందించుచున్నది. ప్రాకృతమైన దేశమునందు ప్రశాంతమైన తత్త్వమే దైవమని భావించి, ఆ దైవముయొక్క అనుగ్రహమునకు పాత్రులుకావలెనని ఉచ్చరించిన వాక్కులే ఋక్కులుగా మారినవి. అయితే, యజ్ఞయాగాది క్రతువులచేత పారమార్థిక తత్త్వమును అర్థము చేసుకొని దివ్యత్వమును పొందవలెనని వ్యక్తి ఆశ, ఆకాంక్ష. అందుకొరకు యజ్ఞ యాగములు ప్రారంభిస్తూ వచ్చారు. ఇట్టి కర్మకాండయే యజుర్వేదమని పేర్కొనబడింది. అంతేకాక, పవిత్రమైనటువంటి, శ్రుతిబద్ధమైనటువంటి, మధురమైనటువంటి, సున్నితమైనటువంటి, సౌశీల్యమైన గానమును అనుగ్రహించగోరి తద్వారా ఆనందగీతను అందించటంచేత దీనికి సామవేదమని సార్థక నామము వచ్చింది. లౌకికమైన జగత్తును పండితులు విస్మరించినారనే అపనిందలు లేకుండా ఉండే నిమిత్తమై శ్రేయోమార్గము, ప్రేయోమార్గము రెండింటితోకూడిన మానవతా తత్త్వమును అభివృద్ధిగావించే నిమిత్తమై పండితులు అధర్వణవేదమును ఆధారముగా తీసుకున్నారు. అయితే అధర్వణవేదము అపౌరుషేయము కాదని విశ్వసించి కేవలము ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదములనే ప్రధానముగా భావించి దీనిని 'త్రయీ' అని పిలుస్తూ వచ్చారు. కాని, సర్వ ధర్మములకు మూలమైన, సర్వ శాస్త్రములకు కీలకమైన, సర్వ సాధనలకు గమ్యమైన నిజ తత్త్వాన్ని గుర్తింపచేసుకొనే నిమిత్తమై ఈ అధర్వణ వేదము అనేకవిధములుగా భౌతిక మార్గములకు ఆదర్శప్రాయమైంది. ఒక్కొక్క వేదము ఒక్కొక్క పద్ధతిని మాత్రమే అనుసరించినప్పటికిని ఈ అధర్వణ వేదము మిగిలిన వేదములు అన్నింటిని ఏకముగా అనుసరించటానికి పూనుకున్నది. ఋగ్వేదము వాక్కు అని, యజుర్వేదము మనస్సని, సామవేదము ప్రాణమనియు బోధించి ఈ మూడు వేదములయొక్క సారమును క్రోడీకరించి విపులముగా అందిస్తూ వచ్చింది, అధర్వణ వేదము. వాక్కు ఋగ్వేదమే కావచ్చునుగాని, ఎట్టి వాక్కు ఋగ్వేదము అనే విషయాన్ని వివరించి చెప్పింది. మనస్సు యజుర్వేదమే కాని ఎట్టి మనస్సు యజుర్వేదమునకు సమన్వయమవుతుంది అనే విషయమునుకూడా

sri sathyasai vahini

బోధించింది. సామవేద సారాన్ని క్రోడీకరించి గానరూపముగా గానము చేసింది, యజుర్వేదము.

**దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న**
**పొంచిచూచు కనులున్న పంచల విను మనసున్న**
**వంచన గుణ చిత్తమున్న వంచించే పలుకున్న**
**ఈ వికృతులు చూడగనే న్యాయమింక బ్రతుకదన్నా**

ధర్మము, న్యాయము, సత్యము మూడింటియొక్క చేరికతోనే త్రిలోకములు వెలుగుతున్నాయి. ఇట్టి పవిత్రమైన సత్యాన్ని ప్రబోధించిన వేదాన్ని మనము చాలా అలక్ష్యపరుస్తున్నాము.

**మనన, ప్రాణ సమ్మిళితమైనది మంత్రము**

వేదము అనేకవిధములైన అంగములు అభివృద్ధి పరచుకుంటూ వచ్చింది. వీటినే శాఖలు అని చెబుతూ వచ్చారు. మొదటిది మంత్రము, రెండవది బ్రాహ్మణము, మూడవది ఆరణ్యకము, నాల్గవది ఉపనిషత్తులు అని. మనన, ప్రాణ సమ్మిళితమైనది మంత్రము అనే సత్యాన్ని సులభమైన మార్గములో అందిస్తూ వచ్చింది. దైవత్వాన్ని గురించి సంభాషణ జరిగినప్పుడు మాటలే మంత్రములుగా విశ్వసిస్తూ వచ్చింది. ఇది బ్రహ్మచర్య సాధనకు సంబంధించినదిగా బోధిస్తూ వచ్చారు. మానవత్వములో యిది ప్రధానమైన పునాది. బ్రహ్మచర్యము, గార్హస్తము, వానప్రస్తము, సన్యాసము అనే నాలుగు గోడల భవనమునకు ఈ బ్రహ్మచర్యము మొట్టమొదటిది మరియు పునాదివంటిది. గృహస్థ, వానప్రస్త, సన్యాసములు బ్రహ్మచర్యముపైనే ఆధారపడి ఉన్నవి. కనుక, జీవితములో బ్రహ్మచర్య సమయమునందు తన జీవితమును మంత్రమయముగా మార్చుకోవాలి. మంత్రమనగా పవిత్రమైన పలుకులు.

**జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితం పరమం వదామి**
**ఆవర్ణయేథా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.**

sri sathyasaivachanamrutam

మానవత్వమునకు అందించిన ఈ జిహ్వకు పవిత్రమైన పలుకులు పలకమని ఆదేశిస్తూ వచ్చారు. బ్రహ్మచారి అసత్యము చెప్పకూడదని, అధికంగా మాట్లాడకూడదని, ఒకరికొకరికి తంటాలు పెంచకూడదని, పరదూషణ చేయకూడదని, ఇవి నాలుక చేసే నాలుగు పాపములని, కనుక, ఇట్టి నాలుగు పాపములకు గురికాకుండా సంరక్షించుకోమని బోధిస్తూ వచ్చింది మంత్రము. తన జీవితములో ఈవిధమైన సుగుణములను అభివృద్ధి పరచుకున్నప్పుడు భవిష్యత్తంతయు రాజబాటగా రూపొందుతుంది. రెండవది, బ్రాహ్మణము. ఈ మంత్రములను మనము ఏవిధముగా ఉపయోగించాలి, ఈ మంత్రముయొక్క ప్రభావము ఏమిటి, ఇది అందించే ఫలితము ఏమిటి అనే సత్యాన్ని గుర్తింపజేసేదే బ్రాహ్మణము. ఇట్టి మంత్రమును అర్థసహితముగా ఉచ్చరించుటచేత ఆ పండితులకు బ్రాహ్మణులు అని పేరు వచ్చింది. దీనిని గృహస్థ ధర్మముగా విశ్వసిస్తూ వచ్చారు. అర్థ సహితములైన మంత్రములను ఉచ్చరించి, లోకకళ్యాణమునకు, నిత్యజీవితములో ఎదురయ్యే అతివృష్టి, అనావృష్టి మొదలైన విపత్తులను దూరముగావించే నిమిత్తము, స్వర్గప్రాప్తిని కలిగించే నిమిత్తమై గృహస్థుడు సమష్టిస్వరూపుడై జీవితమును ఆదర్శప్రాయముగా తీర్చిదిద్దుకోవాలని బోధిస్తూ వచ్చారు. కనుక, గృహస్థ ధర్మము చాలా పవిత్రమైనదని విశ్వసిస్తూ వచ్చారు. ఈ గృహస్థు ధర్మాన్ని చక్కగా నిర్వర్తించి క్రమేణా వానప్రస్తములో ప్రవేశిస్తాడు. ఈ వానప్రస్తముయొక్క తత్త్వమునకే 'ఆరణ్యకము' అని పేరు పెట్టారు. అనగా గృహమునందుగాని, పట్టణమునందుగాని నివసించక సమీపమునందున్న అడవులయందో, తోటలయందో తమ జీవితమును ప్రశాంతముగా గడిపి దైవచింతనచేత తమయొక్క శేషజీవితమును సార్థకము చేసుకోవడము. అరణ్యములందు కాలమును గడుపుతూ పవిత్రమైన పరమాత్మ చింతన సల్పినవారు కనుక ఇట్టి వైదిక ధర్మమునకు 'ఆరణ్యకములు' అని పేరు వచ్చింది. ఇంక, నాల్గవది ఉపనిషత్తులు. ఈ పదము చిత్రవిచిత్రమైన అర్థములతో కూడి ఉంటున్నది. ఇందులో ప్రధానమైన పదము 'షత్'. అనగా కూర్చొనుట, కదలుట, నిర్మూలముచేయుట, ఆశ్రయించుట అని అనేక అర్థములున్నవి. కాని, సమయసందర్భములు పురస్కరించుకొని ఆ పదమునకు మనము అర్థమును తీసుకోవలసి వస్తుంది. ఇక్కడ 'షత్' అనే పదమునకు 'కూర్చొనుట' అనే అర్థము

sri sathyasai vahamrutam

తీసుకొనుట అవసరము. దీనికిముందు 'ఉప', 'ని' అనే రెండు పదములుంటున్నవి. 'ఉప' అనగా సమీపము, 'ని'-అనగా నిష్టతో. ఈ మూడింటిని మనము చేర్చినప్పుడు 'ఉపనిషత్' అవుతుంది. వేదవేత్తకు సమీపమునందు నిష్టతో కూర్చొనుట అని దీని అర్థము. కూర్చొని ఏమి చేయుటం? ఈ వేదవేత్త బోధించిన విద్యలన్నింటిని ఏకాగ్రచిత్తుడై హృదయమునకు హత్తుకొనునట్లుగా ఆలకించటం.

## చైతన్యము సర్వత్రా నిండియున్నది

ఈవిధమైన శబ్దములు విని, గ్రహించి, అర్థమును తెలుసుకొని తనయందు భావించుకొనడమే 'ఎఱుక' అనే పదముతో ఉపయోగపెడుతూ వచ్చారు. 'ఎఱుక' అనగా చైతన్యము అని అర్థము. దీనినే చేతనము అని పిలుస్తారు. ఈ చేతనము ఎక్కడున్నది? ఈ చేతనము సర్వత్రా నిండినది. లోకంబులు, లోకస్థులు, లోకేశులు సర్వమూ చైతన్యస్వరూపములే! ఇది జడము, చైతన్యము రెండింటియొక్క ఏకత్వముతో కూడినటువంటి తత్త్వము. ఈ చైతన్యము మానవునియందు అధికముగా ఉంటున్నాది. మిగిలిన ప్రాణులకంటె మానవునియందు ఈ చైతన్యము అనేకవిధములుగా ప్రకటింపబడుతున్నది. సామాన్యముగా చూచునవి కన్నులు, వినునవి చెవులు, మాట్లాడునది నోరు, అని మనము భావిస్తున్నాము. కాదు, కాదు. కన్నులకు చూపు కలిగించునది చైతన్యమే, చెవులకు శబ్దము వినిపింపచేసేది చైతన్యమే, నోటితో మాట్లాడించేదీ చైతన్యమే! చైతన్యము అంతర్భూతమై బహిరింద్రియములకు ప్రకాశమును కలిగించి, ప్రకటితము గావించుచున్నది. సర్వత్రా చైతన్యమే ఉంటున్నది. అయితే, మానవుడు తన దృష్టిని బహిర్ముఖము గావించటంచేత ఈ అంతరంగ చైతన్యమును గుర్తించలేకపోతున్నాడు. అనగా ప్రకటితము కాకుండా వుంటున్నది. ఇంద్రియముల తత్త్వమును క్రమక్రమముగా అంతర్ముఖము గావించుకున్నప్పుడు ఈ ప్రకాశము, ఈ చైతన్యము విరివిగా పెరుగుతుంది. ఇది సామాన్య మానవులకంటె మహనీయులయందు మరింత ప్రస్ఫుటంగా వుంటుంది. దైవత్వమే చైతన్యము. ఈవిధంగా తారతమ్యము కనిపించటానికి కారణం ఏమిటి? ఒక చిన్న ఉదాహరణము. ఇక్కడ చిన్నచిన్న బల్బులు

srisathyasai vachanamrutam

పెట్టారు. ఆ స్తంభముపై కొంచెం ప్రకాశవంతమైన బల్బులు పెట్టారు. మధ్యలో యింకా ప్రకాశవంతమైన బల్బులు పెట్టారు. మన ఎదురుగా చాలా ప్రకాశవంతమైన బల్బులు పెట్టారు. కాని, అన్నింటియందున్న కరెంటు ఒక్కటే! వోల్టేజి వ్యత్యాసముగా కనిపించవచ్చు. సర్వులయందు, సర్వ జీవులయందు, సర్వత్రా ఉండినటువంటిది, ఈ చైతన్యము. దానిని గుర్తించుకునే వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. అయితే, ఈ ప్రకాశము కొంతవరకు మరుగుపడటానికి ఒక కారణముంటున్నాది. ఈ ప్రకాశము బహిర్గతము కాకపోవటానికి ఆరు విధములైన అటంకములు ఉన్నవి. వీటినే ఆరు దొంగలు అని వ్యవహరిస్తూ వచ్చింది, వేదము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు. ఈ అరిషడ్వర్గములు మాత్రమే కాకుండా అష్ట మదములుకూడా దీనిని అరికట్టుతున్నాది. కులమదము, బలమదము, యవ్వనమదము, సౌందర్యమదము, విద్యామదము, ధనమదము, రాజ్యమదము, తపోమదము. ఈ మదములు అంతరంగ చైతన్యమును ఆవరించటంచేత దాని ప్రకాశమును మనము సరిగా అనుభవించలేకపోతున్నాము, అందుకోలేక పోతున్నాము. ఇట్టి చైతన్యమును మనము సర్వత్రా ఏకత్వముగా అనుభవించవలెనన్న ఆత్మతత్త్వాన్ని విశ్వసించి ఈ బహిర్‌తత్త్వమైన గుణములను అరికట్టుకోవడానికి తగిన కృషి చేయాలి. కాని, ఇవి కేవలము మన భ్రాంతులనుండియే ఆవిర్భవించినవి. మన వలననే పుట్టి, మన వలననే పెరిగి, మన వలననే అభివృద్ధియై మనలనే బాధిస్తున్నవి.

### మానవునియందు పుట్టి పెరిగిన అరిషడ్వర్గములు, అష్టమదములు మానవునే బాధిస్తున్నవి

ఈనాటి సాంకేతిక విజ్ఞానమునందు మీకు తెలిసిన విషయమే, అనేకమంది వైజ్ఞానికులు తమయొక్క బుద్ధికుశలతచేతను, తెలివితేటలచేతను, విద్యాసంపత్తిచేతను అనేకవిధములైన బలవత్తరమైన ఆయుధములను, అస్త్రములను, కొన్ని యంత్రములను సృష్టిస్తూ వచ్చారు. ఒక చిన్న ఉదాహరణము. ఆటంబాంబు ఉంటున్నాది. హైడ్రోజను బాంబు ఉంటున్నాది, ఇవి ఎవరు సృష్టించారు? మానవునియొక్క మేధాశక్తిసంపత్తిచేతనే ఇవి సృష్టింపబడినవి. దీనికి ఎవరు రూపాన్ని కలిగించారు? మానవుడే! ఎవరు దీనికి రూపము కలిగించి, శక్తిని యిచ్చి ఏ స్థానమునందు నిలబెట్టాడో ఆ మానవునే ఈ బాంబులు బెదిరిస్తున్నవి,

srisathyasaivahini.org

అదిరిస్తున్నవి. ఆధునిక శాస్త్రవేత్తలు వాటిని తయారు చేయటము, అభివృద్ధి పరచటము నేర్చుకున్నారేగాని అదుపులో పెట్టుకోవడము నేర్చుకోలేదు. అదేవిధముగా ఈనాడు మనయందు ఆవరించిన ఈ అరిషడ్వర్గములు, ఈ అష్టమదములు మనద్వారానే పెరిగి, మన ద్వారానే అభివృద్ధియై మనలనే బాధించటానికి ప్రయత్నిస్తున్నవి. ఇట్టి సత్యాన్ని విచారణచేత మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కులమదము. కులమదమంటే ఏమిటి? ప్రతి మానవునియందున్న దివ్యత్వమే నాయందు ఉంటున్నది. సర్వ మానవులు సమానమే. జాతి, మత భేదములకు ఏమాత్రమూ అవకాశము లేదు. అందరూ ఒక్క ప్రభువుయొక్క బిడ్డలమే. నేను ఏ జాతికి చెందినవాడినని భావించుచున్నానో నీవుకూడా ఆ జాతికి సంబంధించిన వాడవే. ఈవిధమైన అర్థాన్ని గుర్తించుకుంటే అహంకారమునకు అవకాశమే ఉండదు. ఇంక ధనబలము చూద్దామా అంటే అన్నీ కదలిపోయే వస్తువులు. వస్తుంది, పోతుంది. ధనము మానవునికి అవసరమే. కాని, ఎంతవరకో అంత మాత్రమే. దానిని హద్దులో ఉంచుకోవాలి. ప్రతి మానవుని జీవితము ఒక హద్దులోనే ఉంటున్నది. మన దేహములో 98.4 డిగ్రీలు టెంపరేచరు వుండినప్పుడే పెరఫెక్ట్ నార్మల్. $99^0$కి పోయిందా రోగమే! మన దేహములో 120-80 బ్లడ్‌ప్రెషర్ పెర్‌ఫెక్ట్ నార్మల్. 90 వున్నదంటే రోగము ప్రారంభమైంది అని అర్థము. మన కన్నులు కొంచెము వెలుతురు మాత్రమే చూడగలవుగాని మితిమీరిన వెలుతురు చూడలేవు. మితిమీరిన వెలుతురును చూస్తే కంటిలోని రెటీనా కాలిపోతుంది. ఇదేవిధముగా మానవదేహములో ప్రతి అంగముయొక్క శక్తిసామర్థ్యములు చక్కగా విచారణచేసి చూస్తే మన జీవితమంతా ఒక లిమిటెడ్ కంపెనీ అని బోధపడుతుంది. ఇట్టి హద్దులోనున్న జీవితములో అహంకారపడటానికి ఏమి కారణం? ఏమాత్రమూ అవకాశము లేదు. ఎప్పుడో, ఏనిముషమో, ఏమౌతుందో? తొమ్మిది చిల్లుల తోలుతిత్తియెగాని కాంతి కలిగిన వజ్రఘటము కాదు, నిముషనిముషమునకు నీచులూరునెగాని పునుగుజవ్వాదీలు పుట్టబోవు, కడుపులోన మలము కడమెల్ల ఎముకలు, అరచి చూడ పైన మురికి తోలు. ఈ శరీరము ఎప్పుడు ఏవిధంగా మరణిస్తుందో ఎవ్వరికి ఎరుకలేదు.

**అందము ప్రాయము ఇంద్రియశక్తియు**



srisathyasaivahini.org

**ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసళ్ళ పండుగ**
**తైతై తైతై తై బొమ్మా దీని తమాష చూదర తోలుబొమ్మ!**

అన్నారు. ఈవిధమైన తత్త్వమును చక్కగా గుర్తించినప్పుడు మనలో అహంకారమునకు అవకాశమే ఉండదు. ఇది ఏమాత్రమూ మనలో ప్రవేశించదు. అప్పుడే మనయందున్న చైతన్యము దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది.

**విశ్వవ్యాప్తమైన దివ్య చైతన్యమును మనము ఎక్కడుంటే అక్కడే దర్శించవచ్చును**

ఈ చైతన్యము జాగ్రత్స్వప్నసుషుప్తాదులయందు కూడను ఉంటున్నది. స్థూలసూక్ష్మకారణ మహాకారణములందుకూడను చైతన్యము వుంటున్నది. మూడు కాలములందు, మూడు లోకములందు, మూడు గుణములందు ఇది నిలచి ఉంటున్నది. ఒక చోట ఉన్నదనిగాని వేరొకచోట లేదనిగాని చెప్పుటకు వీలులేదు. అలాంటి దివ్యమైన చైతన్యమును మనము దర్శించవలెనంటే ఎక్కడ ఉంటే అక్కడనే దర్శించవచ్చు. అయితే, ఆవరించిన వాటిని తొలగించుకోవడానికి కొంత కృషి చేయాలి. ప్రమిద, నూనె, వత్తి కలదు, దీపపు వెలుగు కలుగునా? ముట్టించువాడు ఒకడు ఉండాలికదా! పూవులు, సూది, దారము ఉన్నాయి; పుష్పమాల తానగునా? పూలు గుచ్చేవాడు ఒకడు వుండాలి కదా! స్వర్ణము, రత్నాలు కలవు, సొమ్ములు నిర్మాణమగునా? చేసే కంసాలి ఒకడు ఉండాలికదా! విద్య కలదు, బుద్ధి కలదు, గురువులేక లభ్యమగునా? పుస్తకములో ఎ, బి, సి అక్షరాలుంటున్నాయి. కాని, ఫలానిది ఎ, ఫలానిది బి, ఫలానిది సి అని చెప్పే గురువు ఒకడు ఉండాలికదా. లేకపోతే దానిని 'ఎ' అని ఎలా అంటావు? దేనిని 'బి' అంటావు? కనుక, దీనిని సూచించేవాడు ఒకడు ఉండాలి, అతనే మార్గదర్శకుడు. మార్గదర్శకుడు లేకుండిన మనము మార్గమున నడువలేము. అట్టి అనుభవజ్ఞుడైన, సర్వజ్ఞుడైన ఒక మార్గదర్శకుని వెతుక్కోవడానికి మనం కృషిచేయాలి. అట్టి దివ్యవ్యక్తిని పొందే మార్గములే వేదశాస్త్రయితిహాసపురాణములు. కేవలము లౌకిక గురువులను మనము

sri sathyasai vachanamrutam

ఆశ్రయించటంచేత మరింత పతనమైపోతున్నాము. అనుభవజ్ఞులైన గురువులు అత్యవసరము. ఆచారరూపమైన ప్రచారములు చేసే గురువులు అత్యవసరము. కేవలము గ్రంథములు మాత్రమే ఆధారముగా తీసుకొన్న అవి మనకు ఏవిధమైన గంధాన్ని అందించలేవు.

**హృదయము ప్రేమమయమైనప్పుడు దృష్టి బ్రహ్మమయంగా ఉంటుంది**

అందరూ గురువులని మనం భావించరాదు. గురుతత్వాన్ని చక్కగా గురుతెరిగినవాడే కావాలి. గురుతు అనగా ఏమిటి? తెలుసుకోవటము. తెలుపటమే చైతన్యముయొక్క స్వభావము. ఏవిధంగా తెలుపుతున్నాది? ఇది మంచి, ఇది చెడ్డ అని తెలుపుతుంది. అన్నింటిలో ప్రప్రథమంలో మనము సమత్వాన్ని భావించరాదు. క్రమక్రమేణా దీనియొక్క అంతర్భూతమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించిన తరువాత సమత్వాన్ని వహించవచ్చు. ఏ పురుగు ఎట్టిది అని గుర్తించుకోకుండా అన్ని పురుగులూ తేనెపురుగులని భావించటము వెఱ్ఱితనము.

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా?**
**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?**
**పులిచర్మము గప్పినట్టి గాడిద తా పులియగునా?**
**ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?**

కనుక, అందరిని సమానంగా భావించుకోవటం అసాధ్యమైన విషయము. కాని, ఒక్కటి మాత్రం మనం సమత్వంగా అభివృద్ధిపరచుకోవాలి. తనయందు తాను సమత్వాన్ని పెంచుకోవాలి. మన కంటికి ఏ రంగు అద్దాలు వేసుకుంటామో జగత్తంతా ఆవిధంగా చూడవచ్చు. హృదయము ప్రేమమయమైనప్పుడు మన దృష్టి బ్రహ్మమయంగా ఉంటుంది. హృదయములో ప్రేమ లేకుండా సర్వం బ్రహ్మమయం అనవచ్చుగాని అది మన అనుభూతిలోనికి రాదు. కనుక, చైతన్యముయొక్క తత్త్వాన్ని మనము చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. మీందరూ చైతన్య స్వరూపులే! కనుక, మొట్టమొదట ఈ చైతన్యమునకు అడ్డుతగిలినవాటిని కొంతవరకు క్రమేణా తొలగించుకోటానికి కృషి



sri sathyasai vachanamrutam

చేయాలి. దీనినే వేదాంతము 'నేతి, నేతి, నేతి. దేహము నేనుకాదు, మనస్సు నేనుకాదు, చిత్తము నేనుకాదు, అంతఃకరణ నేనుకాదు, నేను నేనే!', అన్నది. ఈ సత్యాన్ని మనం అర్థము చేసుకోవాలి. మనము కోరేది ఒకటి, చేసేది మరొకటి. మనము కోరిన దానిని దక్కించుకునే నిమిత్తమై తగిన సాధనలు, తగిన ప్రక్రియలు చేపట్టాలి.

**పిలచి అడుగ చెఱకు పెట్టునా బెల్లంబు**
**పిప్పిగొట్టి రసము పీల్చుకున్న!**

మనము చెఱకును పిప్పిగొట్టినప్పుడే రసము వస్తుందిగాని, 'ఓ చెఱుకా! నాకు రసమియ్యి' అంటే యిస్తుందా? ఎప్పటికీ యివ్వదు.

### కృంగి పొంగని సమతత్త్వాన్ని అలవరచుకోనటానికి కృషి చేయాలి

మన దేహమనేది ఒక చెఱకు. దీనిలోనే ఉంటున్నాది చైతన్యమనే రసము. దీనిని అన్ని విధములా శ్రమింపజేసి, కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు, నిందలకు, నిష్ఠూరములకుకూడను సహించి భరించే శక్తిసామర్థ్యములు మనము మొట్టమొదట సాధించాలి. కాని, మనము ఆస్థితిలో లేము. ఎవరైనా మనను 'ఇంద్రుడు, సురేంద్రుడు, పరేంద్రుడు' అని వర్ణిస్తే ముప్పై పౌనులు బరువు ఎక్కిపోతాము. అంత మనము ఉబ్బిపోతాము. 'నీవు దుష్టుడు, పాపి, ఇట్లాంటివాడు, అట్లాంటివాడు' అంటే మనము కృంగిపోతాము. కాని, ఇట్టి కృంగిపొంగని సమతత్త్వాన్ని మనం అనుభవించటానికి తగిన ప్రయత్నం చేయాలి. 'ఒకడు నన్ను పొగడడంచేత లేక దూషించటంచేత నాకు ఒరిగినదేమి, తరిగినదేమి?' అనుకోవాలి. 'నాకు ఏమీ ఒరగలేదు, కరగలేదు, తరగలేదు. ఒకడు వర్ణించినా నేను పెరగను. నాది నాదే! నా తత్త్వము నాదే! నా సత్యము నాదే!' అని గట్టి నిర్ణయం చేసుకోవాలి. ఎప్పుడు మనకు భయం ఆరంభమౌతుంది? మనలో సత్యము లేనప్పుడే, మనలో పాపము ఉండినప్పుడే, మనలో ఒక తప్పు ఉండినప్పుడే మనలో భయము ఏర్పడుతుంది. ఇలాంటి దోషము లేనటువంటి సమయములో ఏమి వచ్చినా మనం భయపడనక్కరలేదు. ఆవిధమైన ధీశక్తిని మనం సంపాయించుకోవాలి. ఆవిధమైన ఆత్మశక్తిని మనం అభివృద్ధిపరచుకోవాలి. 'నాయమాత్మ

బలహీనేన లభ్యః' అన్నారు. నీవు బలహీనుడైపోతే అన్నీ నిన్ను బెదిరిస్తాయి. కఱ్ఱ చేతిలో లేకపోతే గొఱ్ఱె అయినా బెదిరిస్తుందట! కనుక, నీ ఆత్మ సంబంధమైన విశ్వాసమే సర్వబలము. అది లేనివాడే అదరటం, బెదరటం చేస్తాడు. ఆవిధమైన ధీశక్తిని మనము సంపాయించుకున్నప్పుడే చైతన్యశక్తి సర్వత్రా మనకు సాక్షాత్కరిస్తుంది. ఎక్కడైనా నీవు ఉండు.

**అడవులందున్న ఆకసముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేటబడియున్న...**

ఎక్కడున్నా నీ చైతన్యము నీ వెంటనే, కంటనే, యింటనే వుండి అన్నివిధముల సంరక్షిస్తుంది.

**దివ్యచైతన్యము మీలోనే ఉంటున్నది**

చైతన్యముకోసమై మనము ప్రాకులాడనక్కరలేదు. ఎక్కడో మనము వెతుకనక్కరలేదు. అది మీలోనే ఉంటున్నది. చైతన్యమునకు అడ్డుతగిలే దానికి పరిహారము చేయి. జగత్తంతా బ్రహ్మయే! సమస్త పదార్థములూ బ్రహ్మయే! సర్వ స్వరూపములు కూడను బ్రహ్మయే! ఇలాంటి తత్త్వమే ఉపనిషత్తులు బోధించిన సత్యతత్త్వములు. మనలో దాగిన, అగోచరముగానున్న, గుప్తమైన ఈ చైతన్యమును మనము వ్యక్తముగావించుకోవాలి. ఇది ఏరీతిగా వ్యక్తముగావించుకోవాలి? మనము చలి సమయములో లోపల బనీను వేసుకుంటాము. దానిపైన ఒక షర్ట్ వేసుకుంటాము. దానిపైన దట్టమైన కోటును వేసుకుంటాము. ఈవిధమైన డ్రస్సు ధరించి నా హృదయము నాకు కనిపించలేదే అనుకుంటే ఏవిధముగా కనిపిస్తుంది? మొట్టమొదట నీవు పైన కప్పిన దట్టమైన కోటును తీసివెయ్యి. తదుపరి దానిక్రింద ఉన్న షర్ట్‌ను తీయి. ఆపైన బనీను తీయి. నీ చెస్ట్ నీకు కనిపిస్తుంది. అదేవిధముగా ఈనాడు తమోగుణమనే దట్టమైన కోటును వేసుకున్నాము మనము. దానిక్రింద రజోగుణము అనే షర్ట్‌ను వేసుకున్నాము. ఈ షర్ట్ మాసిపోకుండా సాత్త్వికమనే పలుచని బనీనుకూడా వేసుకున్నాము. ఈ మూడింటితో కప్పబడినప్పుడు మన



srisathyasaivachanamrutam

హృదయము ఏరీతిగా మనకు కనిపిస్తుంది? కనుక, మొట్టమొదట తమోగుణము తీసివెయ్యి. తదుపరి రజోగుణము తీసివెయ్యి. ఆపైన సాత్త్వికముకూడా తీసివెయ్యి. అప్పుడే నీ ఆత్మతత్త్వము నీకు కనిపిస్తుంది. ఇవి నీవు వేసుకున్న డ్రస్సులే! నీవు వేసుకున్నవి తీసివెయ్యి, అంతే! ఉన్నది ఉన్నట్టుగానే కనిపిస్తుంది. దానిని చూడటానికి కొత్త ప్రయత్నము చేయనక్కరలేదు. నీ గుణములయొక్క తత్త్వాన్ని నీవు పెంచుకున్నావు. పెంచుకున్న గుణములను చించివెయ్యి. ఉంచుకున్న హృదయాన్ని చక్కగా దర్శించు. దీనికి కూడను దైవానుగ్రహము కావాలి. ఈ దైవానుగ్రహము పొందే నిమిత్తమై మనము సాధనలు చేయాలి. నెగిటివ్, పోజిటివ్ రెండూ చేరిప్పుడే అనేక ఉపయోగములు చేసుకోవచ్చు. అట్లు చేయక ఎన్ని క్షేత్రములు తిరిగినా, ఎన్ని సాధనలు చేసినా, ఎందరు మహనీయులను దర్శించినప్పటికిని కించిత్తుకూడను ఆనందమును అనుభవించలేవు. 'అయ్యో! నేను పుట్టపర్తికి పది తూర్లు పోయివచ్చానే, నా కష్టాలు తీరలేదే!' అనుకుంటావు. ఎట్లా తీరతాయి? పుట్టపర్తి వస్తేనే కష్టాలు తీరతాయా? 'తిరుపతికి వెళ్ళి అన్ని మొక్కులూ చెల్లించినానే, నా బాధలు తీరలేదే', అనుకుంటే ఎలా తీరుతాయి? ఈనాటి భక్తిప్రపత్తులన్నీ తుచ్ఛమైన ప్రార్థనలతో నిండి ఉంటున్నాయి. నీవు కోరవలసింది ఒక్క దైవాన్నే? నీకు సర్వస్వమూ తానే అనుగ్రహిస్తాడు. ఇది కావాలి, అది కావాలి అని పదార్థాలు కోరితే పరమాత్మ నీకు దక్కడు. కావలిసిన బంగారు మన చేతిలో పెట్టుకుంటే రకరకాల నగలు మనం చేయించుకోవచ్చు. దైవానుగ్రహానికి తగిన కృషి చేయాలి. దైవాన్నే మనం కోరవలసింది. కారణమేమనగా నీవుకూడను దైవమే! దైవానికి ద్రోహం చేయటం, నిన్ను నీవు ద్రోహం చేసుకోవటమే! ఈ సత్యాన్ని నీవు గుర్తించినప్పుడే చైతన్యము నీకు ప్రాప్తిస్తుంది. మనయొక్క అల్ప భావనలను, అల్ప బాధలను లక్ష్యమునందుంచుకొని అనంతమైన, పవిత్రమైన, దివ్యమైన దైవత్వాన్ని దూరం చేసుకోవటానికి యేమాత్రమూ ప్రయత్నించకూడదు. మనము చదివే చదువులుగాని, నేర్చే చదువులుగాని కేవలము ఆత్మతత్త్వాన్ని గుర్తించుకునే నిమిత్తము.

**(తేదీ 10-12-1986న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam